


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 278 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శనివారం, 01 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 278 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SATURDAY, 01 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## ఎస్ఐఆర్ ప్రక్రియలో

# 44.89 లక్షల ఓట్లు తగ్గాయి !



### ఆగస్టు 30వరకు క్లెయిమ్ లు, ఫిర్యాదుల స్వీకరణ

### సెప్టెంబర్ 28 వరకు క్షేత్ర స్థాయిలో విచారణ

### అక్టోబర్ 3న తుది జాబితా విడుదల

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

**అమరావతి, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి బ్యూరో** : రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో గతంతో పోలిస్తే 44.89 లక్షల ఓట్లు తగ్గాయి. ఈ మేరకు రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 44,89,488 మంది నుండిఎన్యుమరేషన్ ఫారాలు అందే అవకాశం లేదని (అన్ కలెక్టబుల్) నిర్ధారించినట్లు చెప్పారు. వీరిలో మరణించిన వారు 15.22లక్షలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు వారు 22.30లక్షలు, డబుల్ ఎంట్రీలు 7. 37లక్షల ఓట్లుగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. డబుల్ ఎంట్రీలు ఉన్న వారికి ఒక చోట ఓటును కొనసాగించినట్లు తెలిపారు. మొత్తం ఓట్లలో 10.78 శాతం ఓట్లు అన్ కలెక్టబుల్ జాబితాలో ఉన్నట్లు తేలిందని చెప్పారు. రాష్ట్రంలో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయానికి 4,16,27,694 మంది ఓటర్లు ఉండగా, 3,71,38,182 (89.22శాతం) మంది ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి అందించారని తెలిపారు. వీరిఇలో పురుష ఓటర్లు 1,82,06954, మహిళా ఓటర్లు 1,89,28,492, థర్డ్ జెండర్ 2,736 మంది ఉన్నట్లు తెలిపారు. అన్ కలెక్టబుల్ జాబితాలో పురుష ఓటర్లు 21,89,783గా నమోదుకాగా, మహిళా ఓటర్లు 22,99,035, థర్డ్ జెండర్ 694 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై జులై 31 నుంచి ఆగస్టు30 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 28 వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారి పేర్లను అక్టోబరు 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో చేరుస్తామని తెలిపారు. 28 జిల్లాల్లో జిల్లా ఎన్నికల అధికారులు, ఇఆర్ఒలు 175మంది, ఎఇఆర్ఒ 1079, బిఎల్ఒ సూపర్ వైజర్లు 4650, బిఎల్ఒలు 46,397మంది ఇంటింటి సర్వేలో పాల్గొన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఎలు వైసిపి 45,973, టిడిపి 44,603, బిజెపి 27,583, జనసేన 8,988, సిపిఎం 364, కాంగ్రెస్ 356, బిఎస్ పి1, ఆమ్ ఆద్మీ 1చొప్పున మొత్తంగా 1,27,863 మంది బిఎల్ఎలు పాల్గొన్నారని చెప్పారు.

## స్థానిక ఎన్నికలపై కసరత్తు

### పీఆర్, మున్సిపల్ అధికారులతో 6న ఎన్నికల కమిషనర్ భేటీ




**అమరావతి, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి** : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠా ఈనెల 6న మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో భేటీ కానున్నారు. స్థానికసంస్థల ఎన్నికలకు సంబంధించిన కసరత్తు ప్రారంభించేలా దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. కమిషన్‌కు అవసంమైన బీసీ జనాభా వివరాలను పంచాయతీరాజ్‌శాఖ అందించింది. ముందు మున్సిపల్, ఆ తర్వాత పరిషత్, చివరగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ క్రమంలో మున్సిపల్ వార్డుల విభజన, కోర్టులో కేసు కారణంగా స్టే ఉన్న మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చర్చించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేయనున్నారు.

## అంబటి రాంబాబు పై సీఐడీ కేసు!



**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి** : వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై సీఐడీ పోలీసులు కేసునమోదు చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సంకెళ్లు వేసినట్లు ఆయన అభ్యంతరకర వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేశారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పెమ్మసానిని కించపరిచేలా, ఆయన ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించిన అంబటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, మంగళగిరిలోని సీఐడీ అదనపు డీజీ కార్యాలయంలో ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు శుక్రవారం వారు ఫిర్యాదు చేశారు.







## పెద్ది సుదర్శన్ అంతిమయాత్ర..

### ఉద్యమ సహచరుడిని కోల్పోయా పెద్ది మృతికి హరీష్ సంతాపసం




## మీ రాక కోసం

### ఎదురుచూస్తున్నాం మోదీజీ

ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు




## విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు




## ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం

- లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు
- ఇప్పటికే కంపెనీలకు పలుమార్లు నోటిసులు
- పురోగతి లేని కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం సిద్ధం.
- ప్రతి రైతుకు సకాలంలో మొక్కల పంపిణీ
- క్షేత్రస్థాయిలో సాంకేతిక సహాయం అందాలి
- కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి




ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

## నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరైన కెటిఆర్

## ఉజ్జయిని మహంకాళి బోనాలు

### 2 నుంచి 4 వరకు ట్రాఫిక్ ఆంక్షలు



# మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**

అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

**లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు**

న్యూయార్క్: అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది.

విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

## విశాఖపట్నం ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు..

విశాఖపట్నం: :భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో "కర్టెన్ రైజర్" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో.. పర్యాటక శాఖ చేపట్టిన ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమం ఆహుతులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలంటే అభివృద్ధి, రవాణా అనుసంధానత (కనెక్టివిటీ) ఎంతో అవసరం. రైలు, రోడ్డు, ఆకాశ, జల మార్గాల ద్వారా సమర్థవంతమైన కనెక్టివిటీ ఏర్పడితే పరిశ్రమలు వస్తాయి, పర్యాటకరంగం విస్తరిస్తుంది, తద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరుగుతుంది. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో ఆనందదాయకం. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అని నామకరణం చేశారని గుర్తుచేస్తూ, ప్రజా కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని" మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. విమానాశ్రయ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతన్నలకు కృతజ్ఞతలు తెలుపుతూ సైకత శిల్పంలో "థాంక్స్ ఫార్మర్స్" అని సముచితంగా పొందుపరచడం అభినందనీయం అని మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను సైకత శిల్పంగా మలచడం అద్భుతంగా ఉందని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పచ్చదనం, పరిశు భ్రత, పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఋషికొండ బీచ్ 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పొందడం గర్వకారణం అని పేర్కొన్నారు. బీచ్‌ను నిరంతరం శు భ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వల్లే ఈ గుర్తింపు కొనసాగుతోందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకులు ఎవరూ ప్లాస్టిక్ వ్యర్థాలను బీచ్‌లో పడేసి దీని ఔన్నత్యాన్ని దెబ్బతీయవద్దని, ప్లాస్టిక్ వల్ల గుర్తింపు కోల్పోతే రాష్ట్రానికే అప్రతిష్ఠ వస్తుందని హితవు పలికారు. ఋషికొండ బీచ్ వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు - సెల్ఫీ పాయింట్లు:దాదాపు 500 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ట్రస్ట్ తరఫున చిన్నారులు చేసిన అద్భుతమైన నృత్య కార్యక్రమాలను, గిరిజన నృత్య కళారూపాలను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ద

## ఉజ్జయిని మహంకాళి బోనాలు

**2 నుంచి 4 వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

హైదరాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఆగస్టు 2 ఆదివారం నుంచి 4 మంగళవారం వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా మహంకాళి ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. పొగాకు బజార్, సుభాష్ రోడ్, హిల్ స్ట్రీట్ రహదారులను తాత్కాలికంగా మూసివేయనుండగా, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, ఘాస్‌మండి, బైబిల్ హౌస్, కర్బాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు

మళ్లించనున్నారు. భక్తుల సౌకర్యార్థం హరిహర కళాభవన్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ మాల్, వెస్లీ కాలేజ్, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్‌తో పాటు మొత్తం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్యాట్నీ నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లే వాహనాలను ప్యారడైజ్, క్లాక్ టవర్ మీదుగా మళ్లించనుండగా, ప్యారడైజ్ నుంచి ఎంజీ రోడ్ వెళ్లే వాహనాలను సింధీ కాలనీ మీదుగా డైవర్ట్ చేయనున్నారు.

# జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్ట్ విధ్వంసం



కాకినాడ: జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యమైందని, దానిని పూర్తి చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా సాగుతోందని ఏపీ జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు. క్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ.1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం

నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందితే జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. సీదిరి అప్పలరాజు కుమారుడిని కాపాడుకుందామని అనేక తప్పులు చేశారు. నిందితుడిని కాపాడుతూ జగన్ ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఎందుకు మౌనంగా ఉన్నారు? ఆయన అయినా జగన్‌కి హితవు చెప్పాలి. అప్పలరాజుకు పరామర్శ పేరుతో బలప్రదర్శన నిర్వహించారు. మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడి హేయమైన చర్య. జైలు వద్ద జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. దానయ్య కుటుంబానికి ఆయన క్షమాపణ చెప్పాలి. భోగాపురం విమానాశ్రయాన్ని జగన్ వ్యతిరేకించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదు. మోదీ-చంద్రబాబు సారథ్యంలో ఎయిర్‌పోర్టు సిద్ధమైందని నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా

వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ



**శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద ఉధృతి**

**జూరాలకు భారీగా చేరుకుంటున్న వరద**

**ఎల్లంపల్లి వద్ద శ్రీపాదకు భారీగా నీరు రాక**

**భద్రాచలం వద్ద గోదావరికి ఒకటో నంబర్ హెచ్చరిక జారీ**

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో

కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఎ÷-లో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరింది. కల్యాణ కట్ట, స్నానఘట్టాలు వరద నీటిలో ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం

43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ నుంచి 8.35లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ 59 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. వరద నీటితో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరదనీరు చేరడంతో వెంకటాపురం-భద్రాచలం మధ్య రాకపోకలకు అంతరాయమేర్పడింది.

# నాంపల్లి ఎసిబి కోర్టుకు హాజరైన కెటిఆర్

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో ఊఓఅంకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్విండ్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఈఇక్ష కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ

ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కేటీఆర్ లక్ష పూచీకత్తు , 2 షూరిటీస్ సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

## పెద్ది సుదర్శన్ అంతిమయాత్ర..



హైదరాబాద్: ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్యాంతికి, విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మృత్యువును జయించి తిరిగి వస్తారనే ఆశతో మనమంతా ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన పోరాట యోధుడిగా, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సోదరుడిగా పెద్ది సుదర్శన్ అన్న ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతారని హరీశ్‌రావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగ తంగా నాకు ఒక ఉద్యమ సహచరుడిని, ఆత్మీయ సోదరుడిని కోల్పో యిన బాధ ఇది అని అన్నారు. పెద్ది సుదర్శన్ అన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ? వారి కుటుంబ సభ్యు లకు, బంధుమిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. పెద్ది అన్నకు జోహార్లు తెలిపారు.

## బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**అభిమాన నాయకుడు మరణంతో విషాదం**

వరంగల్: తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శు క్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది. అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా

గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
శనివారం, 01 ఆగష్టు 2026




# జిజిహెచ్ లో అవినీతి 'రాబందు'లు

**కుంభకోణాల కింగ్‌పిన్ జూనియర్ అసిస్టెంట్ పై చర్యలేవి ?**
**టీచర్స్ మెడికల్ బోర్డు ఫైల్ గల్లంతు..**
**కలెక్టరేట్ నుంచి ఆసుపత్రికి తెచ్చి తొక్కిపెట్టిన అదృశ్య హస్తాలు !**
**ఫోర్జరీలు, రెమ్‌డెసివిర్ దందాలు చేసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు**




**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జిజిహెచ్) పేద ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యలయంగా కాక, అవినీతి రాబందులకు, కరడుగట్టిన స్కామర్లకు స్వర్గధామంగా మారింది. ఉపాధ్యాయుల మెడికల్ బోర్డు సర్టిఫికెట్ల జారీ పేరుతో జరిగిన ఘోరమైన టాంపరింగ్, దందాల వెనుక ఉన్న సదరు జూనియర్ అసిస్టెంట్‌పై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల దిగజారుడుతనానికి, అవినీతి తిమింగలాల లాలూచీకి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది.

**విచారణంతా డ్రామా.. ఫైలును ముసుగులో తొక్కేశారు !**
ప్రస్తుత సూపరింటెండెంట్ వైద్య ధ్రువీకరణ పత్రాల జారీలో కొంత పారదర్శకత పాటిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, గతంలో జరిగిన భారీ కుంభకోణాలను త్రవ్వి తీయడంలో యంత్రాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. జూనియర్ అసిస్టెంట్ బండారం బయటపడటంతో సదరు కీలకమైన ఫైల్‌ను విచారణ నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి పంపారని, అయితే అక్కడి నుంచి మళ్లీ ఆసుపత్రికి తెచ్చి రహస్యంగా తొక్కిపెట్టారని ఉద్యోగ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఫోర్జరీకి గురైన ఆ అత్యంత కీలకమైన ఫైల్ ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఉందో లేక ఆసుపత్రి రికార్డు రూమ్‌లో మగ్గుతుందో కూడా చెప్పలేని దయనీయ స్థితిలో అధికారులు ఉండటం సిగ్గుచేటు.

**రాజకీయ బరితెగింపు.. రక్షణగా నిలుస్తున్న బడా నాయకులు!**
తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న ఆ జూనియర్ అసిస్టెంట్, తన రాజకీయ బలంతో యంత్రాంగాన్నే శాసించే స్థాయికి తెగబడ్డాడు. మళ్లీ అదే కీలకమైన సెక్షన్‌లో పోస్టింగ్ తెచ్చుకోవడానికి సదరు ఉద్యోగి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేటాయింపును అడ్డుకున్నప్పటికీ.. క్రిమినల్ రికార్డు ఉన్న ఆ ఉద్యోగిని సస్పెండ్ చేయకుండా ఆసుపత్రిలోనే కొనసాగించడం వెనుక ఏ బడా నాయకుడి అభయహస్తముందో బహిరంగ రహస్యమే!

**మానవత్వాన్ని బొందపెట్టిన అక్రమాల చిట్టా :**
**DSC ఫోర్జరీ స్కామ్:** డీఎస్సీ అభ్యర్థుల అర్హతల పరిశీలన మరియు సర్టిఫికెట్ల జారీలో దొడ్డిదారిన లాభం చేకూర్చేందుకు సదరు ఉద్యోగి తీవ్రస్థాయిలో ప్రభుత్వ రికార్డుల ఫోర్జరీకి పాల్పడినట్లు నివేదికలు చెబుతున్నాయి.
**కరోనా కాటుపై రెమ్‌డెసివిర్ దారీమళ్లింపు:** ప్రాణాంతక కరోనా మహమ్మారితో ప్రజలు ప్రాణాలు వదులుతుంటే, అత్యవసరమైన 'రెమ్‌డెసివిర్' ఇంజెక్షన్లను సైతం నల్లబజారుకు తరలించి శవాలపై చిల్లర ఏరుకున్న దారుణ చరిత్ర ఈ ఉద్యోగిది.
**లోకాయుక్త కేసుల అణచివేత:** లోకాయుక్త విచారణలు, సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నా.. నిజాలు బయటకు రాకుండా అధికారులు సమాధానాలు దాటవేస్తూ నిందితుడికి ముసుగు కప్పుతున్నారు.
**తక్షణమే డిస్మిస్ చేయాలి:** ఉద్యోగ వర్గాల ఆగ్రహజ్వాలలు "అవినీతికి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌లా మారిన ఆ ఉద్యోగిని తక్షణమే సర్వీసు నుంచి తరిమి కొట్టకపోతే జిజిహెచ్ ప్రతిష్ట పూర్తిగా మట్టికొట్టుకుపోవడం ఖాయం." విచారణల పేరుతో కాలయాపన చేస్తూ ఆ ఉద్యోగిని రక్షించే కుట్రలు తక్షణమే ఆపాలి. సదరు జూనియర్ అసిస్టెంట్ సర్వీస్ రికార్డు, పెండింగ్ ఫిర్యాదులు, లోకాయుక్త కేసుల ఆధారంగా తక్షణమే విధుల నుంచి తొలగించాలి. తీవ్రమైన ఈ అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, ఫైళ్లను తొక్కేస్తూ ఈ దందాకు సహకరించిన ఉన్నతాధికారుల పాత్రపై కూడా ఉన్నత స్థాయి తనిఖీలు జరిపించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కిడ్నాపర్లు రౌడీలకే జగన్ వత్తాసు : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** 'ఒక వైపు పొగాకు వ్యాపారం పేరుతో కిడ్నాప్ లకు పాల్పడుతున్న రౌడీలను వెనకేసుకొచ్చే జగన్, ఇప్పుడు పొగాకు రైతుల పరామర్శలకు వెళ్లడం దుర్మార్గం. గుంటూరులో మాజీఎమ్మెల్యే ముస్తఫా కుమారుడి అరాచకాలు కనిపించడం లేదా ? సీదిరి అప్పలరాజు కుమారుడి దౌర్జన్యాలు తెలియడం లేదా రాష్ట్రంలో గొడ్డలి పార్టీది అంతా నీచ సంస్కృతి. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై అంబటి తీరును ఖండిస్తున్నాం. పెమ్మసానిని విమర్శించే స్థాయి అంబటికి ఉందా? ఇలాంటి పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయాలి' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక 13వ వార్డు చౌత్రా సెంటర్ లో సంక్షేమ పాలన-ఇంటింటికీ ప్రచారంలో భాగంగా మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ఒక్కొక్కరి వద్ద సుమారు ఐదు నిమిషాలు కేటాయించారు. ప్రభుత్వం అందిస్తోన్న సేవలను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, గుంటూరులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడిని, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి వంటి దొంగల ముఠాను వెనకేసుకొస్తోన్న జగన్ పరామర్శల పేరిట పనికిమాలిన యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బోగాపురం ఎయిర్ పోర్టుకు స్థల సేకరణ, అనుమతులన్నీ పూర్తి చేస్తే జగన్ వచ్చి శంకుస్థాపన చేశారని తెలిపారు. కేవలం ఐదేళ్లలో 26 శాతం మాత్రమే పనులు చేసి 86 శాతం పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఒకరు చేసిన పనులను తమ ఖాతాలో వేసుకోవాలనే ఆరాటం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బాబాయిహత్యను నరకాసుర వధ పేరిట ప్రచారం చేసిన జగన్.. ఇప్పుడు తమ పార్టీ నేతలను కూడా అలాగే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన స్థాయిలో ప్రజలకు అందించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చినప్రతి హామీని అమలు చేశామని, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో యువతకు మంచి భవిష్యత్తు అందించబోతున్నామని చెప్పారు. డీఎస్సీ అసత్య ఆరోపణలతో వైసీపీ యువతను పక్కదోవ పట్టిస్తోందని మండిపడ్డారు.

## డీఎస్సీ అక్రమాలపై
### సీబీఐ విచారణ జరపాలి: నూరి ఫాతిమా



**డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్సీపీ ఆందోళన.. జేసీకి వినతి**

**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** డీఎస్సీ నియామకాలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గుంటూరు జాయింట్ కలెక్టర్‌కు వైఎస్సార్సీపీ నేతలు అంబటి రాంబాబు, నూరి ఫాతిమా శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి నూరి ఫాతిమా మీడియాతోమాట్లాడారు. మెరిట్ జాబితాలో పేర్లు వచ్చిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ కోటాలో సుమారు 400 పోస్టుల్లో అక్రమాలు జరిగాయని ఉద్యో గాల పేరుతో రూ. 15 లక్షలు డిమాండ్ చేసినట్లు కాల్ రికార్డులు ఉన్నాయని ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని విచారణకు ప్రభుత్వం సిద్ధంగా లేకపోతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని అన్నారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామని జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. డీఎస్సీ వ్యవహారంలో న్యాయం జరిగే వరకు టౌన్‌హాల్ సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడండి



**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు, 31 జూలై 226, భారత్ ప్రతినిధి :** గుంటూరు పశ్చి మ నియోజకవర్గంలోని చిన్న, సన్నగల్లీల్లోనూ మురుగు కాలు వల సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజల నుంచి వినతులు స్వీక రించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్య లు చేపట్టాలని సూచించారు. 18వ డివిజన్ వడ్డెగూడెం ప్రాంతా నికి చెందిన ప్రజలు మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణం, పార్కులోని భారీ వృక్షం వల్ల ఎదుంవుతున్న ఇబ్బందులు, సైడ్ కాలువల్లో మంచినీటి పైపులు ఉండటంతో కలుషితమయ్యే ప్రమాదాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిం చిన గళ్ళా మాధవి సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదు పాయాల కల్పనలో ఎలాంటి లోటు పాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఇటీ వల జరిగిన జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు పతకాలు సాధించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెంది న క్రీడాకారిణి పేరూరి జ్యోతి వర్మను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినం దించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలఅభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. భవిష్యత్తులో పవర్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జ్యోతి వర్మ విజయాన్ని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

## ఉత్తరాంధ్రలో జగన్మోహన్ రెడ్డి పరామర్శ పర్యటనల పేరుతో అలజడలు



**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఉత్తరాంధ్రలో జగన్మోహన్ రెడ్డి పరామర్శ పర్యటనల పేరుతో అలజడలు సృష్టించారని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత రాజకీయాల పట్ల సుముఖంగా ఉన్నారా? విముఖంగా ఉన్నారా? అనేది ఆలో చించాలని అన్నారు. నిన్న ఉత్తరాంధ్రలో జగన్మోహన్ రెడ్డి పరామర్శ పర్యటనల పేరుతో అలజడలు సృష్టించారు. సిదిరి అప్పలరాజు ని పరామర్శించడానికి యాత్ర లా వెళ్లి ఏం చేశారు. జగన్మోహన్ రెడ్డి పరామర్శకు వెళ్లి కులాలు మీద మాట్లాడుతున్నాడు. రాజకీయ ముసుగులో కులాలు, మతాలు మధ్య చిచ్చు పెడుతున్నారు. ఈ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి ఏమి చేసాడని ప్రజలు వస్తున్నారో ఆలోచించుకోవాలి. మాజిమంత్రి సిదిరి అప్పలరాజు చట్టాన్ని దుర్వినియోగం చేశాడు. వైసీపీ లో ఉన్న నాయకులు అవినీతి భాగోతాలు బయటకు వస్తున్నాయి. రాష్ట్రం అభివృద్ధి చెందాలి కంపెనీలు రావాలని జనసేన ఆలోచిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు వారి డ్యూటీలు సక్రమంగా పని చేయాలి. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదు. వైసీపీ కి చెందిన నాయకులను, కార్యకర్తలను చూస్తుంటే పోలీసులే భయపడుతున్నారు. పదవి విరమణ సమయంలో బెనిఫిట్స్ ఇవ్వలేక ప్రభుత్వాలు 58 సంవత్సరాలు నుండి 62 సంవత్సరాలకు పెంచారు. 62 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు విధులు ఎలా నిర్వహిస్తారు. మీకు నచ్చినట్లు పెంచుకుంటూ పోతే నిరుద్యోగ యువత చాలా మంది ఉన్నారు వారి పరిస్థితి ఏమిటి ? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు, మిర్చి యార్డ్ డైరెక్టర్ నక్కల వంశీ కృష్ణ, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్,నగర ఉపాధ్యక్షులు కొండూరు కిషోర్ కుమార్, తిరుమలశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

## ఆదివారం నుంచి తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలు : జేసీ


**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** రైతు బజార్లు, రైస్ మిల్లుల అవుట్ లెట్ స్టోర్ లలో తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చుట్టుగుంట, బస్‌స్టాండ్, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు రైతు బజార్లలో విక్రయాలు జరుగుతాయన్నారు.

## రైల్వే పనులను పరిశీలించిన గుంటూరు డీఆర్ఎం



**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ నంద్యాల-గాజులపల్లి సెక్షన్లో పర్యటించారు. ఆయన వెంట గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ పాల్గొన్నారు. గాజులపల్లి వద్ద జరుగుతున్న రైల్వే నిర్మాణపనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ పురోగతిని జీఎం సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని గుంటూరు అధికారులకు సూచించారు.

## అఖిల భారత శరీర అవయువ దాతల సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు 3న 'ఆర్గాన్ డొనేషన్ డే' వేడుకలు




**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** అఖిల భారత శరీర అవయువ దాతల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన గుంటూరులో జాతీయ, అంతర్జాతీయ ఆర్గాన్ డొనేషన్ డే వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 3వ తేదీన నగరంలో అవగాహన ర్యాలీ, సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమణ యసస్వీ, మెంబర్ రాధారాణి తెలిపారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి అమరావతి రోడ్ హిందూ ఫార్మసీ కళాశాల వరకు ప్రదర్శన సాగుతుందని అన్నారు. మరణించినా జీవించండి అనే నినాదంతో ఆర్గాన్ డొనేషన్ పై గుంటూరులో 10రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించారు. బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయువాలు దానంచేస్తే మరో ఎనిమిది మందికి పునర్ జన్మను ఇవ్వొచ్చు అని చెప్పారు. అవయువ దానం పట్ల యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. అపోహలు తొలగించుకుని జీవన్ ధాన్ పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## జర్నలిస్టుల సమస్యలపై జేసీకి వినతి పత్రం అందించిన జర్నలిస్టు సంఘాలు




**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఆంధ్ర ప్రదేశ్‌లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ బి జె ఏ) ప్రతినిధులు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవను కలిసి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ పథకంఅమలు, మీడియాఅకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, కార్మికబీమా, జర్నలిస్టుల వృద్ధాశ్రమం ఏర్పాటు తదితర మొత్తం 11 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాను కూల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో గుంటూరులోని జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైసిపి నాయకులు తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెప్తాం

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ




**కాకినాడ బ్యూరో, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** వైసిపి నాయకులు రాష్ట్రంలో వ్యవహరిస్తున్న తీరుచూస్తుంటే ఇటువంటి నాయకులా గతంలో మనల్ని పాలించింది అన్నట్టుగా ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతంనానాజీ వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన నాయకుడి అడుగుజాడల్లో నేరాలకు పాల్పడే తత్వంతో వైసిపి నాయకులు నడుస్తున్నారని, నిన్న ఒక మహిళ ఎస్సై పట్ల వైసిపి నాయకులు అనుసరించిన విధానమే వారి నేర ప్రవృత్తికి నిదర్శనమని అన్నారు. వైసీపీ వారిని సిస్టం ప్రకారం శిక్షించడం,, చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం కొంచెం ఆలస్యం కావచ్చు కాని సరైన సమయంలో తగిన విధంగా తగిన గుణపాఠం చెప్తాం అని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు.

# విశిష్ట సేవలందించిన పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు



**గుంటూరు, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు జిల్లా పోలీసు శాఖలో సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఇతర జిల్లా పోలీసు అధికారులతో కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు.

**ఎస్పీ మాట్లాడుతూ,** పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు, పోలీసు శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. ముఖ్యంగా నక్సలిజం, రౌడీయిజం ప్రభావం ఎక్కువగా ఉన్న కాలంలో చట్ట పరిరక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసిం చారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, సమాజంలో మంచి స్థాయికి చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు సేవా కాలంలో వారికి అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు కూడా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**పదవీ విరమణ పొందిన వారు:**

1. ఎం . గంగాధర్‌రావు (ఏఎస్‌ఐ-1296)-ఈస్ట్‌ట్రాఫిక్ పోలీస్ స్టేషన్-42 సంవత్సరాల సర్వీస్.
2. టీ. హైమ రావు (ఏఎస్‌ఐ-2348)-తెనాలి -2 టౌన్ పోలీస్ స్టేషన్-37 సంవత్సరాల సర్వీస్.
3. ఎం . రమేష్ బాబు-(హెచ్ సి-1527)-తె నాలి 2 టౌన్ పీస్, 36 సంవత్సరాల సర్వీస్.
4. వి. బసవయ్య- ఏఆర్ హెచ్‌సి809 డిఏఆర్ గుంటూరు 42 సంవత్సరాల సర్వీస్.
5 బి. శ్రీనివాసరావు (2076)- తెనాలి తాలూకా పోలీస్ స్టేషన్ 36 సంవత్సరాల సర్వీస్.

ఉద్యోగ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ, వారి భవిష్యత్తు జీవితం మరింత సంతోష కరంగా ఉండాలని జిల్లా ఎస్పీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ బాబు వెల్ఫేర్, ఎంప్టీ ఆర్ఐ శ్రీహరి రెడ్డి, పోలీస్ అసోసియేషన్ నాయకులు, సీఐ శివ ప్రసాద్ లాలపేట పిఎస్ సాంబశివరావు, ఎం.లక్ష్మయ్య, పీఆర్వో శ్రీనివాసరావు మరియు సహఉద్యోగులు బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వరదలపై జిల్లా యంత్రాంగం హై అలర్ట్

**డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బ్యూరో, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సూచనలంక గ్రామాల్లోని గర్భిణీ స్త్రీలను వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు గర్భిణీలకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం లంక గ్రామాల విద్యార్థులకు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన జిల్లాయంత్రాంగం. విద్యార్థుల భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన అధికారులు వరదల కారణంగా నది పరివాహక ప్రాంతాల్లో పంట్లు (ఫెర్రీలు) రాకపోకలు నిలిపివేత.ఫెర్రీ సేవలు పునరుద్ధరించే వరకు ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచన. వరద నీటిలోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరికప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పిలుపు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని సూచన ప్రజల భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ వెల్లడి. వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.





# సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ

**కాకినాడ బ్యూరో (గొల్లప్రోలు), 31 జూలై 2026, భారత ప్రతినిధి :** పిఠాపురం మండలం గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పట్టణ టిడిపి అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆర్థికసాయం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం గొల్లప్రోలు పట్టణ టిడిపి కార్యాలయంలో కూటమి మార్గదర్శకత్వంలో సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు చేతుల మీదుగా లబ్ధిదారునికి ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ఈబీసీ కాలనీకి చెందిన గానుగుల గణపతి అనారోగ్య కారణాలతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రూ 40,000 మంజూరు చేసింది. ఈ మేరకు చెక్కును శుక్రవారం గణపతికి అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు కడారి బాబ్జీ,బస్సా సత్యనారాయణ, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# వరుస నేరాలకు పాల్పడుతున్న నేరస్థుడిపై పీడీ చట్టం కింద నిర్బంధం

**కాకినాడ బ్యూరో, 31 జులై 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ పరిధిలోని సూర్యనారాయణపురానికి చెందిన కొండపల్లి సింహాద్రి (39), తండ్రి సత్తయ్య అనే వ్యక్తి చెడు అలవాట్లకు బానిసై తరచుగా గంజాయి విక్రయాలు, దొంగతనాలు మరియు ఇతర నేరాలకు పాల్పడుతున్నాడు. సదరు వ్యక్తిపై కాకినాడ మూడవ పట్టణ లాఅండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌తో పాటు ఇతర పోలీసు స్టేషన్లలో మొత్తం సుమారుగా 45 కేసులు నమోదయ్యాయి. పలు సందర్భాల్లో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకపోవడంతో పాటు ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వరుసగా నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించబడింది. ఈనేపథ్యంలో కాకినాడ జిల్లాఎస్పీ జి. బింధు మాధవ్ ఆదేశాల మేరకు త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ సదరు నేరస్థుడి పై పీడీ చట్టం కింద ప్రతిపాదనలు రూపొందించి జిల్లాఎస్పీ ద్వారా ప్రభుత్వానికి పంపించారు. దీనిపై ప్రభుత్వం 27-04-2026న పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 31-07-2026న కొండపల్లి సింహాద్రిని అదుపులోకి తీసుకొని, పీడీ చట్టం ప్రకారం నిర్బంధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బింధు మాధవ్, మాట్లాడుతూ జిల్లాలో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పై కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డెయిల్ 112 కాల్ ద్వారా తెలియజేసి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



# హిందూ ధర్మ రక్షణకు ప్రతి గ్రామంలో ధార్మిక సమితులు ఏర్పాటు చేయాలి

## సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి






**చెరుకుపల్లి, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** బాపట్ల జిల్లా చెరుకుపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశంలో ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మండల కన్వీనర్లు హిందూ ధర్మంపై అవగాహన పెంచుతూ, ప్రతి గ్రామంలో అర్చకులు, కుల పెద్దలు, పురోహితులు, భజన గురువులు మరియు దేవాలయ కమిటీ సభ్యులతో కలిపి 22 మందితో గ్రామ ధార్మిక సమితులను ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమితుల ద్వారా వారం వారం భజనలు, సత్సంగాలు, సామూహిక హారతులు నిర్వహిస్తూ ధర్మ రక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో 820 దేవాలయాలను నిర్మించి, ఆయా వర్గాల వారికే టీటీడీ ద్వారా అర్చక శిక్షణ ఇప్పించి, రూ. 5,000 గౌరవ వేతనంతో అర్చకులుగా నియమిస్తున్నామని తెలిపారు. హిందువులందరూ కులభేదాలు మరిచి ధర్మపరిరక్షణకు ఏకమవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా నేతలు పొన్నపల్లి సత్యనారాయణ, రాయపూడి అంకమ్మ చౌదరి, బొలగాని విజయలక్ష్మి, జంజనం హేమశంకరరావు పాల్గొన్నారు.

# శ్రామిక మహిళలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్



## 7 ఏళ్ల నుండి వేతనాలు పెంచకపోతే ఎలా బ్రతకాలని ఆవేదన

**కాకినాడ బ్యూరో, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ కలెక్టరేట్ దగ్గర అంగన్వాడి, ఆశా, వివోఏ, మధ్యాహ్న భోజనం తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని స్కీం వర్కర్లకు అమలు చేయాలని, యాప్ ల పేరుతో పెంచిన పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ కలక్టరేట్ వద్ద ధర్నా చేసి పిఠాపురం రాజా గారి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండతో కూడినవినతి పత్రాలను జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్‌కి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, అంగన్వాడీ వర్కర్స్‌యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్య దర్శి చంద్రమళ్ళ పద్మ, యానిమేటర్ల సంఘం జిల్లా కోశాధికారి మేరీ మాట్లాడుతూ, గత ఏడేళ్ల నుండి స్కీంవర్కర్లైన అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, యానిమేటర్లకు వేతనాలుపెంచకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఏడేళ్లకాలంలో నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటాయని ఆవేదనవ్యక్తంచేశారు. గౌరవ వేతనం వంటి అందమైన పేర్లతో ప్రభుత్వమే నేరు గా శ్రామిక మహిళల కష్టాన్ని దోచుకోవడం ఆపి, తక్షణం స్కీమ్ వర్కర్లు అందరికీ కనీసవేతనం 26వేలుగా నిర్ణయించిఅమలుచేయాలని,పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి లాంటి కనీస చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లందరికీ పది లక్షల బీమా వర్తింపచేయాలి, ప్రమోషన్లలో, రెగ్యులర్ ఉద్యోగాల నియామకాల్లో స్కీంవర్కర్ల సర్వీస్ ఆధారంగా వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనా లను పెంచే వరకు స్కీమ్ వర్కర్లలందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, కోశా ధికారి రామలక్ష్మి, పి.నాగమణి, సునీత, ధనలక్ష్మి, రాజేశ్వరి, మం గదేవి, వీరమణి, వీరవేణి, చామంతి, బుల్లెమ్మ, సుజాత, రత్నం, విజయ, ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు రాయుడు నాగలక్ష్మి, కోశాధికారి నొక్కు లలిత, ఎం.ఆశాజ్యోతి, ఎం.లక్ష్మీ, కర్రీ వెంక టలక్ష్మి, దుర్గాదేవి, మలకా నాగలక్ష్మి, కాకినాడ నగర కార్యదర్శి భారతీప్రియ, ఎం.మేరీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగు పడాలి




## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరీంధిర ప్రసాద్

**కాకినాడ బ్యూరో, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం గా ప్రభుత్వ వైద్యులు,సిబ్బంది అంకిత భావంతో పని చేసి, ప్రజలకు పూర్తిస్థాయిలో సంతృప్తి కరమైన వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలవైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.అనిత తో కలిసి వైద్యారోగ్య శాఖ ద్వారా జిల్లాలో అమలవుతున్న అన్ని రకాల కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇరవై నాలుగు గంటలూ పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రతిస్పందన ఫోన్ కాల్స్ ద్వారా సేకరించే ప్రజాభిప్రాయం విషయంలో ప్రతీ ఆరోగ్య కేంద్రం నూరుశాతం సంతృప్తి స్థాయిని సాధించేలాసేవలందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. వైద్యాధికారులు తప్పనిసరి గా ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉండాలని, చంద్రన్న సంచార చికిత్స సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించడంతో పాటు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను నేరుగా కలిసి వైద్యం అందించాలని సూచించారు. చికిత్సతో పాటు వ్యాధుల నివారణాత్మక వైద్యంలో కీలక పాత్ర పోషించాలని, ప్రాథమికఆరోగ్య కేంద్రాల ఆవరణలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు, పురపాలక సంఘాల కమిషనర్ల సహకారంతో తక్షణమే అదుపు చర్యలు చేపట్టాలని,వైద్యాధికారులు తమ క్రింది స్థాయి సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు కనీసం అరవై మందికి పైగా ఓపీ ద్వారా సేవలు అందించాలని, మాతృ,శిశు మరణాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల కట్టడి కి సిబ్బందితో కలిసి తగిన చికిత్సా విధానాలు,ఉన్నత ఆసుపత్రులకు సిఫార్సు చేసే సేవలు, ఆ తర్వాత రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే విధానాలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. క్షయ వంటి ప్రమాదకర వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స ద్వారా అదుపు చేయాలన్నారు. అర్హులైన బాలికలందరికీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాలను నూరు శాతం అందించాలని, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఆరోగ్య గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను పూర్తిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్ర ఆరోగ్య సూచిక ర్యాంకులలో మన కాకినాడ జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదటి పది స్థానాల్లో నిలిచేలా వైద్యాధికారులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరు కనబరచాలని జిల్లా కలెక్టర్ స్పష్టంచేశారు. ఈసమావేశంలో జి.జి.హెచ్. సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, డీసీహెచ్ఎస్ డా.కె. మహేశ్వర రావ్, డి.ఎల్.ఏ.టి. ఓ.డాక్టర్ చలమయ్య, డి.ఐ.ఓ. డాక్టర్ కె.వి. సుబ్బరాజు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి. అరుణ,డి. ఎం.ఓ డాక్టర్ ఐ. ప్రభాకర్, డాక్టర్ ఎన్. ప్రశాంతి, ఎన్టీఆర్ వైద్య సేవ డా.రాధాకృష్ణ పాల్గొన్నారు.

# గ్రామాల భద్రతే ధ్యేయం

## చెన్నకేశవ నగర్‌లో ఎస్ఐ కందుల కృష్ణ తిరుపతిరావు 'పల్లెనిద్ర'



**చెరుకుపల్లి, 31 జూలై 2026, భారత్ ప్రతినిధి :** బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని చెన్నకేశవ నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి పోలీస్ యంత్రాంగం 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కందుల కృష్ణ తిరుపతిరావు స్థానిక ప్రజలతో సమావేశమై వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల నిర్మూలనకు "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు మరియు చిన్నపిల్లల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పల్లెనిద్ర కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

## మెటాపై సైబర్ క్రైమ్ పోలీసుల కేసు

## పులువురు సోషల్ మీడియా యూజర్లపైనా కేసు

**హైదరాబాద్,జులై31 :** భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఏఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు ఏఐ సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? ఎ÷-లాట్‌ఫామ్స్ వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ఎ÷-లాట్‌ఫామ్‌లలో ఒఎ స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే పక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై, తమ వద్ద ఉన్న కంటెంట్ మోడరేషన్ విధానాలు, నిబంధనల వివరాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ ఆధారాల ప్రకారమే అన్ని ఆరోపణలను పరిశీలిస్తామని, ప్రస్తుతం ఎవరిపై నేరం రుజువు కాలేదని, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాలు

## 2 నుంచి 4 వరకు ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,జులై31 :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఆగస్టు 2 ఆదివారం నుంచి 4 మంగళవారం వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా మహంకాళి ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. పొగాకు బజార్, సుభాష్ రోడ్, హిల్ స్ట్రీట్ రహదారులను తాత్కాలికంగా మూసివేయనుండగా, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, ఘాస్‌మండి, బైబిల్ హౌస్, కర్బాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. భక్తుల సౌకర్యార్థం హరిహర కళాభవన్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ మాల్, వెస్లీ కాలేజ్, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్‌తో పాటు మొత్తం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్యాట్నీ నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లే వాహనాలను ప్యారడైజ్, క్లాక్ టవర్ మీదుగా మళ్లించనుండగా, ప్యారడైజ్ నుంచి ఎంజీ రోడ్ వెళ్లే వాహనాలను సింధీ కాలనీ మీదుగా డైవర్ట్ చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్సులకు కూడా ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ఎ÷-లాన్ చేసుకుని, ట్రాఫిక్ పోలీసుల సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు సూచించారు.

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

## అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్,జులై31 :** తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి పక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం

## విస్తృతంగా తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు

**హైదరాబాద్,జులై31 :** హైదరాబాద్ నగరంలో వాహనాల నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజులుగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాతోపాటు పెద్దపల్లి, మేడిపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ప్రభుత్వం ఆమోదించిన హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్ ప్లేట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. ఊ÷ూఖీఖ కాకుండా ఇతర నంబర్ ప్లేట్లు వాడితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు, డిజైన్లుతోపాటు అంకెల మార్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లు వాడితే వాహనం సీజ్‌తో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. చలానాల నుంచి తప్పించుకునేందుకు కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్లు మారుస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. ఈ నేపథ్యంలో 'జీరో టాలరెన్స్' విధానంతో ముందుకు వెళ్తున్నట్లు ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

# హైడ్రా, శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసు

## రంగనాథ్‌ను తొలగించాంటూ వెలువడ్డ ఉత్తర్వులు

**హైదరాబాద్,జులై31 :** హైడ్రా ,శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని.. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.

# పోరుబిడ్డకు జన నీరాజనం

**వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులు**

**9 గంటల పాటు అంతిమయాత్ర**

**నర్సంపేట నుంచి నల్లబెల్లి వరకు అంతిమ యాత్రలో నడుచుకుంటూ వెళ్లిన హరీశ్ రావు, ఎర్రబెల్లి తదితరులు**

**దహన సంస్కారానికి హాజరైన కేటీఆర్, మాజీ మంత్రులు.. మంత్రి సీతక్క నివాళి**



**వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ కెరటం.. ఓరుగల్లు పోరుబిడ్డ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ వెన్నంటి నడిచిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్రెడ్డి ఇకలేరు అనే మాటను నర్సంపేటతోపాటు ఉమ్మడి వరం గల్ జిల్లా ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. జూలై 26న ఇంటివద్ద అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో రోహిణి హాస్పిటల్కు, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సికింద్రాబాద్ లోని యశోద సూపర్ స్పెషాలిటీకి తరలించి ఐదురోజుల పాటు ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్యమందించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.51గంటలకు మృతిచెందినట్లు యశోద ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. ఈ వార్త తెలియగానే తెలంగాణ గులాబీ దళపతి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం ఐదు గంట లకు హైదరాబాద్ నుంచి పెద్ది సుదర్శన్రెడ్డి పార్థివ దేహాన్ని హనుమకొండలోని అదాలత్ సెంటర్ లోని అమరవీరుల స్థూపం వద్ద కొద్దిసేపు ఉంచారు. వరంగల్ నగరంలోని మాజీ ఎమ్మెల్యేలు, ఉద్యమనాయకులు, పెద్ది అభిమానులు వండ లాదిగా తరలివచ్చి నివాళులర్పించారు. హనుమకొండ నుంచి బయలుదేరిన పార్థివదేహం 9 గంటలకు నర్సంపేట నియో జకవర్గంలోని కొమ్మాలకు చేరుకున్నది. తమ అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు వేలాదిగా తరలివచ్చారు.

### 11 కిలోమీటర్ల మేర అంతిమయాత్ర

పెద్ది సుదర్శన్ రెడ్డి పార్దెవదేహం ఉదయం 9 గంటలకు నర్సంపేట నియోజకవర్గంలోని గిర్నిబానికి చేరుకోగా, అక్కడి నుంచి నర్సంపేట వరకు 11 కిలోమీటర్ల వరకు సాగిన అంతిమయాత్ర ఐదు గంట లకుపైగా సమయం పట్టింది. అంతిమ రథాన్ని ముందుకు కదలనీయకుండా అడుగడుగునా.. అపుతూ ప్రజలు క న్నీటి నివాళులర్పించారు. గిర్నిబావి నుంచి నర్సంపేట వరకు ఎక్కడ తప్ప మరేది చూసినా.. జనమే క నిపించ లేదు. నర్సంపేటకు చేరుకు నేసరికి అయ్య ప్ప దేవాలయం నుంచి బస్టాండ్ నుంచి అంగడి జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్లల్లో ఎటు చూసిన ఇసుక పోస్తే రాలనట్లుగా జనం తరలివచ్చారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్ నర్సంపేట నుంచి నల్లబెల్లి వరకు అంతిమ యాత్రలో నడు చుకుంటూ వెళ్లారు. పెద్ది సుదర్శన్ రెడ్డి వాహనంలో వస్తున్న భార్య పెద్ది స్వప్న గుండెలు అవిసేలా ఏడుస్తూనే ఉన్నారు. పెద్ద స్వప్నతో పాటు కొడు కు. బిడ్డను చూసి ప్రతి ఒక్కరు చలిం చి పోయారు. నల్లబెల్లి కి సాయం. త్రం ఐదుగం టలకు అంతి మయాత్ర చేరుకున్నది.

### దాహన సంస్కారాలకు కేటీఆర్

దహన సంస్కారాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. నాంపల్లి కోర్టులో కేసు ఉండటంతో కోర్టుకు హాజరై అనంతరం హుటాహుటిన నర్సంపేటకు బయలుదేరివచ్చారు. పెద్ది ఇంటివద్ద సుదర్శన్ రెడ్డి సతీమణి స్వప్నను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమ ఉద్యమ సహచరుడికి కడసారి నివాళులర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. రాత్రి 8తర్వాత దహన సంస్కారాలు నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్రెడ్డి, పాడి కౌశిక్రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రులు హరీష్ రావు, దయాకర్రావు, సత్యవతిరాథోడ్, రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, ఆరూరి రమేష్, బానోత్ శంకర్నాయక్, చల్లా ధర్మారెడ్డి అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు

# ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం**

**పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత**

**హైదరాబాద్,జూలై31 :** పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం

**లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు**

**ఇప్పటికే కంపెనీలకు పలుమార్లు నోటిసులు**

**పురోగతి లేని కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం సిద్ధం.**

**ప్రతి రైతుకు సకాలంలో మొక్కల పంపిణీ**

**క్షేత్రస్థాయిలో సాంకేతిక సహాయం అందాలి**

**కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి**

**హైదరాబాద్,జూలై31 :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైందని, అంటే లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై అత్యంత నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున ఇప్పటికే పలుమార్లు కంపెనీలతో సమావేశాలు నిర్వహించి, ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని మంత్రి అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న సమయంలో కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోహియా కంపెనీకి, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాలలో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న తిరుమల కంపెనీకి, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రియూనిక్ కంపెనీకి, హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పనిచేస్తున్న రామ్ చరణ్ కంపెనీకి మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోద్రెజ్ కంపెనీకి రెండు సార్లు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విశ్వతేజ్ కంపెనీకి ఐదు సార్లు, కేన్ బయో కంపెనీకి ఆరు సార్లు, పతంజలి కంపెనీకి ఆరు సార్లు, మాట్రిక్స్ కంపెనీకి ఐదు సార్లు, సువేన్ ఆగ్రో కంపెనీకి మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపెనీలలో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ, కంపెనీలు ఇంకా బాధ్యతాయుతమైన వైఖరి కనిపించడంలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడిన ఏ కంపెనీ అయినా వారి పరిధిలోని జిల్లాలను తగ్గించడానికైనా లేక పూర్తిగా తొలగించడానికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని, అలాగే మెరుగైన పనితీరు కనబరిచే కంపెనీలకు మరికొన్ని జిల్లాలను అప్పగించే ఆలోచనకు ప్రభుత్వం సిద్ధం ఉందని అన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనుల్లో పురోగతి లేకుంటే ఆ సంస్థ పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు లేక కొత్త సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మొక్కల లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఎదురయ్యే అవకాశం ఉన్న కంపెనీలు ముందస్తుగా ఇతర కంపెనీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ల్గ÷తు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. యూనిట్ల ఏర్పాటులో జాప్యం కూడా ప్రభుత్వం సహించదని, ఇప్పటికే కావాల్సింత సమయం కంపెనీలకు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

# చందా దొంగలు దిగిపోవాలి

అయోధ్య విరాళాల చోరీపై వినూత్న నిరసన
పూజారి వేషం.. నిధుల మళ్లింపు నాటకం
కాషాయ వస్త్రాలతో ఎంపీ పప్పు యాదవ్
అతిథి పాత్రలో రాహుల్, ప్రతిపక్ష నేతలు
హుండీలో విరాళాలు వేస్తూ ఆందోళన
చందా చోర్, గద్దీ చోడ్ అంటూ నినాదాలు
పార్లమెంట్లో చర్చ పెట్టాలని డిమాండ్
విపక్షాలపై బీజేపీ నేతల ఆగ్రహం
స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు



**న్యూఢిల్లీ :** దేశాన్ని వరుసగా పలు సంఘటనలు కుదిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీక్తో కేంద్రం బద్నాం అయ్యింది. చివరికి కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్తో రాజీనామా చేయించింది. అదే సమయంలో ప్రతిష్ఠాత్మకమైన అయోధ్య ఆలయంలో విరాళాల చోరీ తెర మీదకు వచ్చింది. బీజేపీ ఎన్నికల్లో లబ్ధి పొందుతూ వచ్చిన అయోధ్యలో కూడా స్కామ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే దీనిపై సిట్ విచారణ కొనసాగుతోంది. జంతర్ మంతర్ లో సీజేపీ, విద్యార్థుల ఆందోళనలతో విపక్షాలు ఒక్కటి కాగలిగాయి. ఇప్పుడు నీట్ అంశం సద్దుమణగగా, తెరమీదకు అయోధ్య విరాళాల చోరీతో కేంద్రంపై విపక్షాలు పోరు సాగిస్తున్నాయి. పార్లమెంట్లో చర్చించాలని కోరుతూ వినూత్న రీతిలో ఆందోళన తెలిపాయి. అయోధ్య రామాలయం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపైపార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు వినూత్నరీతిలో వీధి నాటకం ప్రదర్శించారు. కాషాయ దుస్తుల్లో ఎంపీ పప్పు యాదవ్ పూజారిగా నటించగా, రాహుల్ గాంధీ సహాపలువురు నాయకులు ఇందులో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ ప్రాంగణం శుక్రవారం ఓ వీధి నాటక వేదికను ఈ చినూత్న ప్రదర్శన తలపించింది. అయోధ్య రామాలయ విరాళాల నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలపై ప్రతిపక్ష ఎంపీలు మకర్ ద్వార్ మెట్ల వద్ద స్కిట్తో నిరసన చేపట్టారు. పూర్ణియా స్వతంత్ర ఎంపీ రాజేష్ రంజన్ ఆలియాస్ పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి పూజారి పాత్ర పోషించగా, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ నాటకంలో పాల్గొని ఆకట్టుకున్నారు. ప్రతిపక్ష ఎంపీలు నిరసనలో నకిలీ హుండీలను ఏర్పాటు చేశారు. పప్పు యాదవ్ కాషాయ దుస్తులు ధరించి, చేతిలో శ్రీరాముడి చిత్రాన్ని పట్టుకుని ఆలయ పూజారిగా వ్యవహరించారు. భక్తులు వేసే చందాలను హుండీలో వేయకుండా రహస్యంగా తన జేబులో వేసుకుంటున్నట్లు ప్రతీకాత్మకంగా నటించి విరాళాల అవకతవకలను ఎత్తిచూపారు. సమాజ్వాదీ పార్టీకి చెందిన ఓ ఎంపీ భక్తుడి పాత్రలో వచ్చి ఈ దొంగతనాన్ని ప్రశ్నించడం. ఆ తర్వాత పూజారి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోవడం ఈ నాటకంలో ప్రధాన ఘట్టంగా నిలిచింది. రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులుహుండీల్లో డబ్బులు వేస్తూ నిరసనకు మద్దతు తెలిపారు. చందా చోర్, గద్దీ ఛోడ్, అమిత్ షా.. సభకు రావాలి.. అంటూ ఎంపీలు గొంతుకలిపి చేసిన నినాదాలతో పార్లమెంట్ ప్రాంగణం హోరెత్తింది. ఇటీవల విద్యార్థుల నిరసనలపై పోలీసుల చర్యలపై కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు

### విపక్షాలు ఒకే స్వరం.. బీజేపీ గరం గరం..

ప్రతిపక్షాల నిరసన ప్రదర్శనపై బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూ సంప్రదాయాలను, సాధువులను, " సనాతన ధర్మాన్ని ప్రతిపక్షాలు అవమానిస్తున్నాయని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని నిందించడానికే ప్రతిపక్ష నాయకులు సాధువుల వేషధారణను అవమానపరుస్తున్నారు. అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ సాక్షి మహారాజ్ మాట్లాడుతూ, పప్పు యాదవ్ ప్రవర్తన రామాయణంలోని కాలనేమి రాక్షసుడి పాత్రను తలపించిందని విమర్శించారు. కాషాయ రంగును, శ్రీరాముడిని, సనాతన సంప్రదాయాన్ని ప్రతిపక్షాలు దారుణంగా కించపరిచాయని ఆరోపించారు. నిరసన తెలిపిన ఎంపీల ప్రవర్తనపై లోక్సభ స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని, క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయవద్దని హెచ్చరించారని తెలిపారు. మరోవైపు అయోధ్య రామాలయం విరాళాల స్కామ్ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపేందుకు కొత్తగా ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టుకు తెలిపింది. ఐజీ పీ కిరణ్ ఎస్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ బృందంలో డిఐజి, ఎస్పీ, ఏఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారని - సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరాలు అందించారు. మరోవైపు త్వరలోనే యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని ఆరాట పడుతోంది. దీంతో విరాళాల చోరీ అంశంలో అరెస్ట్ చేశామని, విచారణ జరుగుతోందని, నిందితులపై కఠిన చర్యలు తప్పవని ప్రకటిస్తూ వస్తోంది. విపక్షాలు మాత్రం పార్లమెంట్లో చర్చకు పెట్టాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

# సెప్టెంబర్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

### భారత్ ఆతిథ్యంలో సమావేశాలు

### హాజరుకానున్న చైనా అధ్యక్షుడు జిన్పింగ్

**న్యూఢిల్లీ :** చైనా అధ్యక్షుడు జిన్పింగ్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నారు. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తొలిసారి జిన్పింగ్ భారత్ పర్యటనకు రాబోతున్నారు. సెప్టెంబర్లో భారత్లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రావాల్సిందిగా జిన్పింగ్కు భారత్ ఆహ్వానం పంపింది. అయితే భారత్ పర్యటనకు జిన్పింగ్ సిద్ధంగా ఉన్నట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. గల్వాన్ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కనిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో జిన్పింగ్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. బ్రిక్స్ కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలకు చైనా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో.. జిన్పింగ్ ఢిల్లీలో జరిగే శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని ఈ పరిణామాలపై అవగాహన ఉన్న వర్గాలు తెలిపినట్లు సమాచారం. అయితే జిన్పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు చైనా లేదా భారత్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాలని చైనా అధ్యక్షుడికి భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారానికి చైనా అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ కూటమి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందని తెలిపారు. ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్.. శిఖరాగ్ర సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశానికి జిన్పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జిన్పింగ్ భారత్కు వస్తే.. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఆయన చేపట్టే తొలి భారత పర్యటనగా ఇది నిలవనుంది. చివరిసారిగా జిన్పింగ్ 2019 అక్టోబర్లో భారత్లో పర్యటించారు. ఆ సమయంలో తమిళనాడులోని మామ ల్లపురంలో ప్రధాని మోడీతో రెండో అనధికారిక శిఖరాగ్ర సమావేశం నిర్వహించారు. అనంతరం 2020లో గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ చోటుచేసు కోవడంతో భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతి న్నాయి. మరోవైపు ప్రధాని మోడీ 2025లో చైనాలో పర్యటించారు. టియాంజిన్లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా భారత్కు వచ్చే అవకాశం ఉందని క్రెమ్లిన్ ఇప్పటికే ధ్రువీకరించింది. బ్రిక్స్ సభ్యదేశమైన ఇరాన్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఇరాన్ నుంచి ఏ స్థాయి ప్రతినిధి బృందం హాజరవుతుందన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్ కూడా బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో అత్యున్నత స్థాయిలో పాల్గొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాలని బంగ్లాదేశ్ ప్రధానికి ప్రధాని మోడీ ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది. ఈ ఆహ్వానాన్ని ప్రస్తుతం సమీక్షిస్తున్నామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రహ్మాన్ బుధవారం తెలిపారు. బ్రిక్స్ కూటమిలో తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలుగా ఉన్నాయి. 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ దేశాలు బ్రిక్స్లో చేరాయి. 2025లో ఇండోనేషియా కూడా కూటమిలో సభ్యత్వం పొందింది. ప్రస్తుతం విస్తరించిన బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. సెప్టెంబర్లో న్యూఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

### 450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ



**న్యూయార్క్ :** అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్మేకర్ 'ఎన్విడియా' ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# దూషణలతో సమస్యలు పరిష్కారం కావు

### కొందరు ఆకతాయిలు నన్ను, నా మాతృమూర్తిని దూషించారు

### అయినా వారిని క్షమించాను : తాజా ఇన్స్టా రీల్లో ప్రధాని

**న్యూఢిల్లీ:** దూషణలు ఎప్పటికీ దేనిని పరిష్కరించవు అని, తప్పుదారి పట్టిన వారికి మార్గనిర్దేశం చేద్దామని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం రాత్రి జంతర్మంతర్ నిరసనలపై చేసిన తాజా ఇన్స్టారీల్లో పై సందేశమిచ్చారు. జంతర్ మంతర్ వద్ద తనను మాత్రమే కాకుండా, తన దివంగత తల్లిని కూడా దూషించారని అన్నారు. తనను దూషించిన విద్యార్థులను తాను క్ష మించినట్లు, శిక్ష కోరడానికి బదులుగా వారికి మార్గనిర్దేశం చేయాలని సమాజాన్ని కోరారు. తనపైనా, తన తల్లిపైన ఉపయోగించిన దూషణాత్మక నినాదాలు తీవ్ర ఆవేదన కలిగించాయని, అయితే యువత తమ తప్పుల నుండి నేర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని మోడీ నొక్కిచెప్పారు.

# కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

### ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు

### పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు

### కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ :** కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎ÷-లోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

# విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

### లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు

**న్యూయార్క్:** అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్టెన్షన్గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

# మహారాష్ట్రలో పెను విషాదం

### వరద నీటిలో కారు కొట్టుకుపోయిన ఘటన.. తల్లీ ఇద్దరు కూతుళ్లు దుర్మరణం

**ముంబై :** మహారాష్ట్రలో పెను విషాదం చోటుచేసుకుంది. వరద నీటిలో కారు కొట్టుకుపోయిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. తల్లీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం యవాత్మాల్ జిల్లాకు చెందిన అవినాష్ ఖందారే ఫ్యామిలీ కారులో అహిల్యానగర్లోని 'లోని' ప్రాంతానికి బయలుదేరింది. భారీ వర్షాల కారణంగా ధార్మా ఏరియాలో కుప్తీ నది పోటెత్తడంతో.. వరద నీరు అక్కడి ఓ బ్రిడ్జిపైకి వచ్చేసింది. కారు నడుపుతున్న అవినాష్ ఆ వరద నీటిని తక్కువ అంచనా వేశాడు. కారును బ్రిడ్జి మీదకు పోనిచ్చాడు.

కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో కారులో అవినాష్తో పాటు అతడి భార్య మాధవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరూ నీటిలో కొట్టుకుపోయారు. అవినాష్ కారు నుంచి బయటపడి ఓ చెట్టును పట్టుకుని ప్రాణాలు రక్షించుకున్నాడు. మిగిలిన ముగ్గురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసు, డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నీటిలో కొట్టుకుపోయిన వారి కోసం రెస్క్యూ ఆపరేషన్స్ మొదలెట్టాయి. రెస్క్యూ సిబ్బంది శుక్రవారం యవాత్మాల్ జిల్లాలో తల్లీకూతుళ్ల మృతదేహాలను గుర్తించారు.

# పివోకెలో పాక్ ఆర్మీ దాడులు

### తీవ్రంగా ఖండించిన భారత్

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్లో పాకిస్థాన్ ఆర్మీ దాడులపై భారత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. పౌరులపై పాకిస్థాన్ అరాచకాలను భారత్ ఖండించింది. పీఓకేలో దాడులను అంతర్జాతీయ సమాజం పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. పాకిస్థాన్ను జవాబుదారీగా చేయాలని భారత్ పిలుపునిచ్చింది. స్థానిక మానవ హక్కుల సంఘాలు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ తెలిపిన వివరాల మేరకు.. జులై 27, 28 తేదీల్లో రావల్కోట్, మీర్పూర్, కోట్లి, ముజఫరాబాద్ సహా పలు ప్రాంతాల్లో ప్రజలు శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహిస్తుండగా పాక్ ఆర్మీ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 40 మందికి పైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు. పాక్ ఆర్మీ వందలాది మందిని అక్రమంగా అరెస్ట్ చేసి జైళ్లకు తరలించింది. పాక్ సైన్యం తమ అరాచకాలను దాచడానికి స్థానిక ఆసుపత్రులు, వీధుల నుంచి అమాయక పౌరుల మృతదేహాలను బలవంతంగా ఎత్తుకెళ్లి మాయం చేస్తోందని జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నేతలు ఆరోపిస్తున్నారు.

# 2027 వన్డే ప్రపంచకప్‌కు 12 వేదికలు ఖరారు

## ఐసీసీ కీలక ప్రకటన..

24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు ఆఫ్రికా ఖండం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన 12 వేదికలను, అధికారిక బ్రాండ్‌ను ఐసీసీ ప్రకటించింది. జొహన్నెస్‌బర్గ్‌లో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వివరాలను వెల్లడించారు. 'త్రీ నేషన్స్, వన్ హార్ట్‌బీట్' (మూడు దేశాలు, ఒకే స్పందన) అనే నినాదంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఆఫ్రికాలోని ఐక్యత, వైవిధ్యం, "నేను ఉన్నానంటే మనం ఉన్నందుకే" అనే అర్థాన్నిచ్చే 'ఉబుంటు' తత్వాన్ని ఈ బ్రాండ్ ప్రతిబింబిస్తుంది. దక్షిణాఫ్రికాలో 8, జింబాబ్వేలో 3, నమీబియాలో ఒక వేదికను ఈ టోర్నీ కోసం ఎంపిక చేశారు.కొత్త ఫార్మాట్‌లో టోర్నమెంట్ ఈసారి ప్రపంచకప్‌ను సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 14 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో 57 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నమెంట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు మూడు దశల విధానాన్ని ప్రవేశపెట్టారు. 12 నుంచి 14వ ర్యాంకులో ఉన్న జట్ల మధ్య జరిగే 'సూపర్ సిరీస్'తో టోర్నీ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి గ్రూప్ స్టేజ్ నిర్వహిస్తారు. అనంతరం 'సూపర్ 7' రౌండ్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు ఉంటాయి. ఈ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జై షా మాట్లాడుతూ.. ఆఫ్రికాలో క్రికెట్ పునరాగమనానికి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా స్పందిస్తూ.. ఈ ఈవెంట్ ఆఫ్రికా సంస్కృతులు, ప్రజలు, క్రీడపై వారికున్న అభిరుచికి ఒక వేడుకగా నిలుస్తుందని తెలిపారు. సవరించిన ఫార్మాట్ టోర్నీకి మరింత ప్రాధాన్యం, ఉత్కంఠను అందిస్తుందని ఆయన వివరించారు.




### వేదికల వివరాలు

దక్షిణాఫ్రికా: వాండరర్స్ (జొహన్నెస్‌బర్గ్), సెంచూరియన్ (ష్వానే), న్యూలాండ్స్ (కేప్ టౌన్), కింగ్స్‌మీడ్ (డర్బన్), సెయింట్ జార్జ్ పార్క్ (గెబెర్హా), మంగాంగ్ ఓవల్ (బ్లూమ్‌ఫోంటెన్), బోలాండ్ పార్క్ (పార్ల్), బఫెలో పార్క్ (కుగోంపో సిటీ).

జింబాబ్వే: హరారే స్పోర్ట్స్ క్లబ్ (హరారే), క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ (బులవాయో), ఫాలే మోసీ-ఓ-తున్యా ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం (విక్టోరియా ఫాల్స్).

నమీబియా: నమీబియా క్రికెట్ గ్రౌండ్ (విండ్‌హోక్).

### ప్రత్యేక ఆకర్షణగా బ్రాండింగ్

టోర్నమెంట్ విజువల్ ఐడెంటిటీని ఆఫ్రికన్ సంప్రదాయ వైర్ బౌల్ స్ఫూర్తితో రూపొందించారు. జింబాబ్వే చిల్లీ, ఆఫ్రికన్ రూట్, నమీబ్ డ్యూన్ వంటి ప్రత్యేక రంగులను ఇందులో ఉపయోగించారు. కాగా, సీనియర్ ఐసీసీ గ్లోబల్ ఈవెంట్‌కు నమీబియా ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. చివరిసారిగా 2003లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా సంయుక్తంగా ప్రపంచకప్‌ను నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో గ్రేమ్ స్మిత్, మఖాయా ఎన్తిని, హషీమ్ ఆమ్లా, టెంబా బావుమా వంటి మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు పాల్గొన్నారు. టికెట్ సమాచారం కోసం అభిమానులు తమ ఆసక్తిని నమోదు చేసుకోవచ్చని ఐసీసీ సూచించింది.

# గ్లాస్గోలో భారత పతకాల వేట

### లవ్‌ప్రీత్‌కు రజతం, సీమాకు కాంస్యం

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ తన పతకాల సంఖ్యను మరింత పెంచుకుంది. నిన్న జరిగిన పోటీల్లో వెయిట్‌లిఫ్టర్ లవ్‌ప్రీత్ సింగ్ రజతం సాధించగా, డిస్కస్ త్రోయర్ సీమా కలిరమణ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో భారత్ ఇప్పటివరకు సాధించిన పతకాల సంఖ్య 17కి (3 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలు) చేరింది. పురుషుల ౦110 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో లవ్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో మొత్తం 388 కేజీల (స్నాచ్‌లో 176 కేజీలు ౦ క్లీన్ అండ్ జర్క్‌లో 212 కేజీలు) బరువును ఎత్తి రజత పతకాన్ని ముద్దాడాడు. స్నాచ్ విభాగంలో 176 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డు సృష్టించిన లవ్‌ప్రీత్, ఆ దశ తర్వాత అగ్రస్థానంలో నిలిచాడు. అయితే, న్యూజిలాండ్ లిఫ్టర్ డేవిడ్ ఆండ్రూ లిటి క్లీన్ అండ్ జర్క్‌లో 223 కేజీలతో గేమ్స్ రికార్డు నెలకొల్పి, మొత్తం 389 కేజీలతో స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. దీంతో లవ్‌ప్రీత్ కేవలం ఒక్క కిలో తేడాతో స్వర్ణ పతకాన్ని కోల్పోయాడు. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో కాంస్యం గెలిచిన లవ్‌ప్రీత్, ఈసారి తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్నాడు. ఈ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మొత్తం 8 పతకాలు (ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యం) సాధించి తన ప్రస్థానాన్ని ముగించింది. అథ్లెటిక్స్‌లో మహిళల డిస్కస్‌త్రోలో సీమా కలిరమణ 58.65 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తల్లయ్యాక తిరిగి పోటీల్లోకి






రావడం, పీహెచ్‌డీ చేస్తూనే ఈ ఘనత సాధించడం విశేషం. పోటీలో మూడుసార్లు ఫౌల్ చేసినప్పటికీ, మూడో స్థానాన్ని నిలబెట్టుకోవడంలో ఆమె సఫలమైంది. ఈ విభాగంలో జమైకాకు చెందిన సమంత హాల్ (61.66 మీ) స్వర్ణం, కెనడాకు చెందిన జూలియా టంక్స్ (60.67 మీ) రజతం గెలుచుకున్నారు. మరో భారత క్రీడాకారిణి నిధి రాణి 55.67 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచింది.అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. పురుషుల 200 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో అనిమేష్ కుజుర్, విశాల్ టీకే ఫైనల్స్‌కు చేరుకోలేకపోయారు. మహిళల 5000 మీటర్లలో పారుల్ చౌదరి 13వ స్థానంతో సరిపెట్టుకుంది. షాట్‌పుట్‌లో తాజిందర్‌పాల్ సింగ్ తూర్, సమర్‌దీప్ సింగ్ గిల్ వరుసగా ఐదు, ఏడో స్థానాల్లో నిలిచారు. లాన్ బౌల్స్‌లో మాత్రం నవనీత్ సింగ్, దినేష్ కుమార్ జోడీ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.


# ఫిఫాకు యూఈఎఫ్ఏ షాక్.. వరల్డ్ కప్‌ను బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరిక



ప్రపంచ ఫుట్‌బాల్‌లో పెను సంక్షోభం తలెత్తింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తీసుకున్న ఓ వివాదాస్పద నిర్ణయంపై యూరప్ ఫుట్‌బాల్ సమాఖ్య (యూఈఎఫ్ఏ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిఫా తన ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, వరల్డ్ కప్ సహా ఫిఫా నిర్వహించే అన్ని టోర్నమెంట్‌లను బహిష్కరిస్తామని యూఈఎఫ్ఏకు చెందిన 55 సభ్య దేశాలు ఏకగ్రీవంగా హెచ్చరించాయి. ఫిఫా వరల్డ్ కప్ వంటి ప్రపంచ స్థాయి టోర్నమెంట్‌ల వాణిజ్య హక్కులను నిర్వహించేందుకు 20 బిలియన్ డాలర్ల విలువైన ఒక కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో 20 శాతం వాటాను ప్రైవేట్ పెట్టుబడిదారులకు విక్రయించాలని ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో ప్రతిపాదించారు. దీనిపై గురువారం జరిగిన వర్చువల్ సమావేశంలో యూఈఎఫ్ఏ సభ్య దేశాలు తీవ్రంగా చర్చించి, ఈ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాయి. "వరల్డ్ కప్ అనేది ఒక పెట్టుబడి ఉత్పత్తి కాదు. అది తరతరాలుగా ఆటగాళ్లు, అభిమానులు నిర్మించుకున్న గొప్ప క్రీడా వారసత్వం. దాన్ని ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగించకూడదు. వరల్డ్ కప్ అమ్మకానికి కాదు" అని యూఈఎఫ్ఏ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేసే వరకు ఫిఫా టోర్నీలలో పాల్గొనబోమని తేల్చిచెప్పింది. ఇంగ్లండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కూడా యూఈఎఫ్ఏ నిర్ణయానికి మద్దతు ప్రకటించింది. యూరప్‌తో పాటు ఆసియా (ఏఎఫ్‌సీ), ఉత్తర అమెరికా (కాన్‌కాకాఫ్) ఫుట్‌బాల్ సమాఖ్యలు కూడా ఫిఫా ఏకపక్ష నిర్ణయాన్ని, సంప్రదింపుల లోపాన్ని తప్పుబట్టాయి. ఈ పరిణామాలతో 2027 మహిళల వరల్డ్ కప్ వంటి రాబోయే టోర్నీలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# మా దేశం సురక్షితం.. భారత జట్టు తప్పక వస్తుంది: బీసీబీ ప్రెసిడెంట్ తమీమ్ ఇక్బాల్


భారత క్రికెట్ జట్టుతో పరిమిత ఓవర్ల సిరీస్ నిర్వహించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నట్లు బీసీబీ అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ తెలిపాడు. వాస్తవానికి ఈ పర్యటన 2025 ఆగస్టులో జరగాల్సి ఉండగా, ఇరు బోర్డుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు వాయిదా పడింది. ఇప్పుడు ఆ సిరీస్‌ను ముందుకు జరిపి ఈ సెప్టెంబర్‌లోనే నిర్వహించాలని బీసీబీ భావిస్తోంది. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తమీమ్ ఇక్బాల్ ఈ విషయంపై స్పందించాడు. "భారత్‌తో సిరీస్‌పై ప్రస్తుతానికి నా వద్ద కచ్చితమైన సమాచారం లేదు. కానీ, మేము బీసీసీఐతో చర్చిస్తున్నాం. ఇరు బోర్డుల సభ్యుల మధ్య ఈ-మెయిల్స్ ద్వారా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ సిరీస్‌ను సాకారం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం" అని అన్నాడు. భారత్-బంగ్లాదేశ్ సిరీస్ అంటే అభిమానులు, క్రికెటర్లు, మీడియాలో ఎంతో ఉత్సాహం ఉంటుందని తమీమ్ పేర్కొన్నాడు. "బంగ్లాదేశ్ అత్యంత సురక్షితమైన



దేశం. భారత జట్టు ఇక్కడికి వస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. మా వైపు నుంచి తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని భరోసా ఇచ్చాడు. అయితే, ఈ సిరీస్ జరిగితే టీమిండి యా షెడ్యూల్‌లో మార్పులు తప్పకపోవచ్చు. ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఒకవేళ బంగ్లాదేశ్ పర్యటన ఖరారైతే, ఆఫ్ఘన్ సిరీస్ వాయిదా పడే అవకాశం ఉంది. దీనికి తోడు టీమిండియా ఆగస్టులో శ్రీలంకలో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభమయ్యే ఆసియా క్రీడల్లో కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ క్రమంలోనే బీసీసీఐని ఒప్పించేందుకు తాను తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తమీమ్ తెలిపాడు. "బీసీబీ అధ్యక్షుడిగా నాకు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను దాటకూడదు. కానీ, నా పరిధిలో సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తున్నాను. ఈ సిరీస్ జరిగితే కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరిస్తున్నాను" అని చెప్పుకొచ్చాడు. చివరిసారిగా భారత జట్టు 2022లో బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ పర్యటనలో జరిగిన వన్డే సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకోగా, టెస్టు సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

# 2027 ప్రపంచకప్‌కు అతణ్ని తీసుకోండి.. టీమిండియాకు అశ్విన్ సలహా

టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయాలని సూచించాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో భువనేశ్వర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగలడని అభిప్రాయపడ్డాడు. అతణ్ని ఇప్పటి నుంచే దేశవాళీ టోర్నీల్లో ఆడిస్తూ ప్రపంచకప్‌కు సిద్ధం చేయాలని బీసీసీఐకి సూచించాడు. 2026 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపడంలో భువనేశ్వర్ కీలక పాత్ర పోషించాడు. 28 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. అయితే అతడు చివరిసారిగా 2022లోనే భారత్ తరఫున వన్డే ఆడాడు. అయినా అతడి అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అశ్విన్ పేర్కొన్నాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుపైనా అశ్విన్ స్పందించాడు. గాలే పిచ్‌ను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగాలని సూచించాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు ఇవ్వాలని చెప్పాడు. ఏడో స్థానంలో సారాంశ్ జైన్‌ను ఆడిస్తే జట్టు సమతుల్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు.యువ బ్యాటర్ సాయి సుదర్శన్ ఫిట్‌నెస్‌పైనా అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల ఇండియా-ఏ తరఫున గాలేలో సెంచరీ చేయడం అతడికి పెద్ద ప్లస్ అవుతుందని తెలిపాడు. శ్రీలంక స్పిన్‌ను ఎదుర్కొనే సామర్థ్యం సాయి సుదర్శన్‌కు ఉందని చెప్పాడు. అతడు పూర్తి ఫిట్‌గా ఉంటే టీమిండియాకు పెద్ద బలమవుతుందని పేర్కొన్నాడు.





# రామాయణ మూవీలో డ్రెస్సింగ్‌పై సోషల్ మీడియాలో రచ్చ




బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ పలు అంశాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేతాయుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేతాయుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేతా యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వారణాసి వాయిదా ప్రచారాలకు చెక్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మెగా ప్రాజెక్ట్ వారణాసిపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వాయిదా ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడింది. ఈ సినిమా ప్రకటించిన తేదీకే విడుదల కానుందని చిత్ర యూనిట్‌కు చెందిన విశ్వసనీయ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అభిమానుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు స్టార్‌ల కలయికతో పాటు రాజమౌళి దర్శకత్వం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృత స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా విడుదల తేదీ మారొచ్చని ప్రచారం జరిగింది. అయితే చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం అలాంటి పరిస్థితి ఏదీ లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రణాళిక ప్రకారమే కొనసాగుతున్నాయని సమాచారం. ఇప్పటికే కీలక షెడ్యూళ్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చిత్రబృందం పని చేస్తోందని తెలుస్తోంది. 'వారణాసి' విడుదలకు ఇంకా 250 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభిమాను ల్లో ఉత్సాహం మరింత పెరిగింది. రాజమౌళి ప్రతి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించే తీరు, మహేష్ బాబు తొలిసారి ఆయన దర్శకత్వంలో నటిస్తుండటం, ప్రియాంక చోప్రా రీఎంట్రీ వంటి అంశాలు ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. భారీ బ్జడెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై స్పష్టత రావడంతో ఇకపై చిత్రబృందం నుంచి టీజర్, పోస్టర్లు, ఇతర ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వరుస అప్‌డేట్లు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# దీపావళి బరిలో సూర్య 47 మూవీ



కథానాయకుడు సూర్య ఇటీవలే 'కరుప్పు' సినిమా విజయంతో తదుపరి చిత్రాల విషయంలో జోరు పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఆయన... మమితా బైజు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల్ని మరోసారి పలకరించనున్నారు. అయితే తాజాగా సూర్య, కథానాయిక నజ్రియా జంటగా రూపొందుతున్న 'సూర్య 47' చిత్రం కూడా విడుదల తేదీని ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని చిత్రబృందం దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. దీపావళికి విడుదల ఖరారైతే ఈ ఏడాది సూర్య ఖాతాలో మూడు చిత్రాలు చేరనున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో నస్లేన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.

# షూటింగ్‌లో రష్మికకు గాయం.. ఆరు వారాల విశ్రాంతి



ప్రముఖ నటి రష్మిక మందన్న ఒక చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారు. ఒక పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు నిర్ధారించి, ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రష్మిక మందన్న 'రణబాలి' అనే చిత్రంలో తన భర్త, హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. దీనితో పాటు, 'మైసా' అనే మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో రష్మిక గాయపడటం ఆమె నటిస్తున్న చిత్రాల షూటింగ్‌లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆరు వారాల పాటు రష్మిక విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో, ఆమె అంగీకరించిన సినిమాల చిత్రీకరణ షెడ్యూల్స్ వాయిదా పడనున్నాయి. ఈ గాయం నుండి ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



# స్టైలిష్ అవతారం..

## టాక్సిక్ లో కియారా అద్వానీ లుక్ వైరల్!




రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్'. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఓ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. అంతర్జాతీయ స్థాయి రాయల్ లుక్‌లో కనిపిస్తున్న కియారా పోస్టర్ వివరాలు మీకోసం. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ ఎపిక్ మూవీ 'టాక్సిక్'. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా వస్తున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా అపారమైన క్రేజ్ ఉంది. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌తో పాటు 'తబాహి', 'మధోషి' పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచి సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. నేడు కియారా అద్వానీ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ఆమెకు విషెస్ తెలియజేసింది. "హ్యాపీ బర్త్‌డే అవర్ నాడియా.. వెండితెరపై నీ మ్యాజిక్ చూడటానికి వేచి చూస్తున్నాం" అంటూ క్యాప్షన్ జోడించి, సినిమాలో ఆమె పోషిస్తున్న 'నాడియా' పాత్రకు సంబంధించిన కలర్‌ఫుల్ పోస్టర్‌ను మేకర్స్ వదిలారు.

# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?

ప్రముఖ సినీ నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మోక్షజ్ఞ కంటే ముందే ఆమె సందేశాత్మక చిత్రంతో వెండితెరపై మెరవబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342